
సాక్షి హనుమకొండ

ఆదివారం । 20 । జూలై । 2025



ఏడుబావులను చూడగలమా?

మానుకోట జిల్లా బయ్యారం మండలం మిర్యాలపెంట గ్రామ సమీపంలోని ఏడుబావుల జలపాతం సందర్శనను అధికారులు నిలిపివేశారు.

- 8లో▸



ఎకోటూరిజం అభివృద్ధికి అడుగులు!

- 8లో▸

ధర్మసాగర్ మండలం దేవునూరు, ముప్పారం శివారులోని ఇనుపరాతి గుట్టలను శనివారం పీసీసీఎఫ్ సువర్ణ, అధికారులు సందర్శించారు.

గరిష్టం/కనిష్టం
$30^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వర్షం కురుస్తుంది. మధ్యాహ్నం వేళ సాధారణంగా ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాద వాతావరణం ఉంటుంది.

న్యూస్‌రీల్

నో బ్యాక్ బెంచ్.. ఓన్లీ రౌండ్ టేబుల్



కాజీపేట అర్బన్: నో బ్యాక్ బెంచ్.. ఓన్లీ రౌండ్ టేబుల్ బోధనకు కాజీపేట మండలం అయోధ్యపురంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శ్రీకారం చుట్టారు. సాధారణంగా వెనుక బెంచ్‌లో కూర్చునే విద్యార్థులు బాగా చదువరని, ముందు వరుసలోనే తమ పిల్లలను కూర్చోబెట్టాలని ఉపాధ్యాయులను తల్లిదండ్రులు వేడుకుంటారు. ముందు కూర్చుంటే ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వింటారని వారి నమ్మకం. ఈ క్రమంలో అందరు విద్యార్థులు ఒకే వరుసలో కూర్చునే భావన కల్పించేందుకు ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో ఆధారంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మన్నె చంద్రయ్య, ఉపాధ్యాయురాలు శారదాదేవి రౌండ్ టేబుల్ బోధనను శనివారం మొదలు పెట్టారు. దాంతో ఆ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



ఎంజీఎం: గర్భస్థ పూర్వ, పిండ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, డయాగ్నస్టిక్ కేంద్రాలు, వైద్యులు తప్పనిసరిగా ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించాలని హనుమకొండ డీఎంహెచ్‌ఓ అప్పయ్య సూచించారు. డీఎంహెచ్‌ఓ అధ్యక్షతన పీసీ అండ్ పీఎన్‌డీటీ జిల్లాస్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ మేరకు జిల్లాలో చట్టం అమలుకు తీసుకుంటున్న చర్యలు, స్పెషల్ డ్రైవ్‌లు, ఎంటీపీ కిట్ల దుర్వినియోగంపై చర్చించారు. ఈ సందర్భంగా అప్పయ్య మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వైద్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రికార్డులను సంబంధిత వైద్యులు పర్యవేక్షించాలని అన్నారు. ఎంటీపీ కిట్ల విక్రయానికి సంబంధించిన వివరాలను మందులు షాపుల నిర్వాహకులు రిజిస్టర్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. లింగ నిర్ధారణ, అబార్షన్ల సమాచారాన్ని 63000 30940 నంబర్‌కు ప్రజలు కాల్ చేసి తెలపాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ మంజుల, సభ్యులు డాక్టర్ కవిత, లక్ష్యం స్వచ్ఛంద సంస్థ సీఈఓ తాళ్లూరి లత, జిల్లా కోర్టు సిబ్బంది నాగరాజు, డాన్‌బోస్కో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శారద, డెమో అధికారి అశోక్‌రెడ్డి, ఎస్సై ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

జేఈఈ, నీట్‌లో గిరిజన విద్యార్థులకు శిక్షణ

న్యూశాయంపేట: ఐటీడీఏ ఏటూరునాగారం ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ప్రతిభ గల గిరిజన విద్యార్థులకు జేఈఈ, నీట్‌లో దీర్ఘకాలిక శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల గిరిజన విద్యార్థులు ఈ నెల 25లోపు హనుమకొండ బాలసముద్రంలోని టీడబ్ల్యూ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 76759 78439, 83285 46015 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

అధ్యాపకుడిపై విచారణకు కమిటీ

కేయూ క్యాంపస్: కేయూలోని విద్యాకళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ శ్రీనివాస్‌పై విద్యార్థులు పలు ఆరోపణలు చేస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రంకు ఈనెల 18న ఫిర్యాదు చేశారు. వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లారు. దాంతో శ్రీనివాస్‌పై విద్యార్థులు చేసిన ఆరోపణలపై విచారణ జరిపేందుకు కమిటీ చైర్మన్‌గా ఇంగ్లిష్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మేఘనరావు, సభ్యులుగా యూనివర్సిటీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మమత, ఫిజిక్స్ విభాగం అధిపతి డాక్టర్ మంజులను నియమించినట్లు రామచంద్రం పేర్కొన్నారు.

సండే స్పెషల్

నెలకో ఉత్సవం... తియ్యని జ్ఞాపకం

నెలకోసారి పిల్లల పుట్టినరోజు వేడుక

- సరికొత్తగా అలంకరణ.. విభిన్న థీమ్‌లతో నిర్వహణ
- ఏడాది పొడవునా సంబురాలు
- సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ మురిసిపోతున్న తల్లిదండ్రులు



సాధారణంగా పుట్టిన రోజు వేడుకలు ఏడాదికోసారి జరుపుకుంటుంటాం. ఇప్పుడు ట్రెండ్ మారింది. పిల్లలు పుట్టిన మరుసటి నెల నుంచే పుట్టిన రోజున సంబురాలు మొదలు పెడుతున్నారు. నెలకో థీమ్‌తో పిల్లలను వినూత్నంగా అలంకరిస్తున్నారు. కొత్త బట్టలు వేసి ఫొటోలు, వీడియోలు తీస్తున్నారు. కేక్ కట్ చేస్తున్నారు. వాటన్నింటినీ 12 నెలలయ్యాక ఒక చోట చేర్చి ఫొటోఫ్రేమ్‌లు కట్టిస్తున్నారు. వీడియోలు మిక్సింగ్ చేస్తున్నారు. ఫస్ట్ బర్త్ డే (సరిగ్గా ఏడాది) వేడుకల వేళ వాటన్నింటినీ బంధువుల ముందు ప్రదర్శిస్తున్నారు. అంతేకాకుండా సోషల్ మీడియాలో పోస్ట్ చేసి వచ్చిన లైకులు, కామెంట్లకు దంపతులు మురిసిపోతున్నారు. ఈనేపథ్యంలో నయా బర్త్‌డే సెలబ్రేషన్స్‌పై 'సాక్షి' సండే స్పెషల్ స్టోరీ.

పెద్దయ్యాక చూసి మురిసిపోతారు..



భూపాలపల్లి అర్బన్: పిల్లల చిన్నప్పటి ఫొటోలు భద్రంగా ఉంచితే పెద్దయ్యాక చూసి మురిసిపోతారు. మా బాబు పుట్టి శనివారంతో నెల రోజులు. అప్పటికప్పుడు ద్రాక్ష పళ్లతో అలంకరించి వేడుకలు జరుపుకున్నాం. ప్రతీ నెల కొత్త బట్టలు వేసి ఒక్కో రకమైన వస్తువులు, సరుకులు, ఇతర పండ్లతో నెలల నంబర్లు వేసి ఫొటోలు దింపుకునేలా ప్లాన్ చేసుకున్నాం. బాబు పెద్దయ్యాక ఈ ఫొటోలు చూసి మురిసిపోతాడు.

- తోనగర్ శిరీష, చెల్పూరు, గణపురం

కలకాలం గుర్తుండాలని..



కాజీపేట: బర్త్ డే జరుపుకోవడానికి వన్ ఇయర్ వరకు ఎదురు చూడడం ఎందుకని.. నెల నెలా ఒక్కో థీమ్‌తో మా బాబును రెడీ చేశా. ఫొటోలు తీసి భద్రంగా ఉంచా. పెద్దయ్యాక చూపిస్తే బాబు కూడా సంబురపడతాడు. ఒకప్పుడంటే కెమెరామెన్ వచ్చి ఫొటోలు తీసేవాడు. ఇప్పుడు ఫోన్‌లోనే ఫొటోలు తీసి ఎడిటింగ్ చేస్తున్నా. మంచి పాటను యాడ్ చేసి సోషల్ మీడియాలో పెడితే చాలా లైక్‌లు, కామెంట్లు వస్తున్నాయి. ఆనందంగా ఉంది.

- నిత్యశ్రీ, కాజీపేట

ప్రతిక్షణం ఓ తీపి గుర్తే..



నర్సంపేట: కన్నబిడ్డ ఎదుగుదలను ఫొటోల్లో బంధించడం ఓ మధురానుభూతి. ప్రతి నెల బాబు పుట్టిన రోజును ఓ వేడుకలా నిర్వహించుకుంటున్నాం. ఆపరేషన్ సిందూర్ పేరుతో యుద్ధం జరిగిన రోజే మా బాబు కాసర్ల విహాన్ రామానుజన్‌రెడ్డి ఆరో నెల బర్త్‌డే జరిగింది. దీనికి గుర్తుగా ఇండియా ఫ్లాగ్, గన్ చూపుతూ చేసిన వేడుక మర్చిపోలేం.

- కాసర్ల కావ్య, నర్సంపేట

ప్రతీ నెల పండుగే..



సాక్షి, మహబూబాబాద్: మా గారాల పట్టి మోజేస్ పాల్ (జాక్) ఈ ఏడాది ఫిబ్రవరి 28న పుట్టారు. ఉమ్మడి కుటుంబం కావడంతో ప్రతీనెల 28వ తేదీ వచ్చిందంటే సాయంత్రం అంతా సందడే.. పిల్లలు, పెద్దలతో ఇంట్లో ప్రతీ పండుగ వాతావరణం నెలకొంటుంది. ప్రతీ నెల పిల్లవాడు పెరిగిన తీరును చూసుకుంటూ.. సంతోష పడతాం.. ఇలా ఇప్పటి వరకు నాలుగు నెలలు గడిచాయి.. ప్రతీ నెల ఫొటోలు తీసి జాగ్రత్తగా ఉంచుతున్నాం. మొదటి పుట్టిన రోజు సమయంలో ప్రతీ నెల తీసిన ఫొటోలు వరుస క్రమంలో పెట్టి ఫ్లెక్సీ తయారు చేస్తాం..

- దామెర స్వరూప్, ప్రీతి, మహబూబాబాద్

మధురానుభూతి..



జనగామ: ఏడాదికి ఒక్కసారి బర్త్ డే నుంచి.. నెలనెలా వేడుకలు జరుపుకునే ట్రెండ్ కొనసాగుతోంది. మాకు ఒక కూతురు. 3 నెలల బాబు ఆదినందన్ ఉన్నారు. పుట్టగానే 21వ రోజు.. 50.. 100వ రోజుతో పాటు నెలనెలా కొత్త బట్టలతో అలంకరించి కేక్ కట్ చేస్తున్నాం. బిడ్డ జీవితంలో ఈ ఘట్టం మధురానుభూతిగా నిలిచిపోతుంది. ప్రతీ నెల ఫొటోలను భద్రంగా ఉంచుతూ.. ఏడాది జన్మదిన వేడుకల్లో వీటిని ప్రదర్శిస్తాం.

- ఉప్పల వీరవెంకట్, పద్మ, జనగామ

దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శం

- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



వేలేరు: రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ధర్మసాగర్/వేలేరు : దేశంలో ఎక్కడాలేని విధంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ధర్మసాగర్, వేలేరు మండల కేంద్రాల్లోని రైతు వేదికల్లో కొత్త రేషన్ కార్డులను లబ్ధిదారులకు శనివారం పంపిణీ చేశారు. ధర్మసాగర్‌లో 924 నూతన రేషన్ కార్డులతో పాటు మండలానికి చెందిన 17మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. వేలేరు మండలంలో 439 మందికి కొత్త రేషన్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ కొత్తరేషన్ కార్డులు రాని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు కూడా ఇస్తున్నట్లు గుర్తుచేశారు. ఆయా కార్యక్రమాల్లో హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ధర్మసాగర్ తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ అనిల్ కుమార్, వేలేరు తహసీల్దార్ హెచ్.కోమి, ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, ఇరు మండలాల అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- డీఎంహెచ్‌ఓ అప్పయ్య



మల్లారంలోని ఆయుష్మాన్ మందిర్‌లో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య

ఎల్కతుర్తి: వర్షాకాలం సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే ప్రజలు, రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని వైద్య సిబ్బందిని డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య హెచ్చరించారు. భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచడంతో పాటు ఎన్‌సీడీ రీ స్క్రీనింగ్ ప్రారంభించాలని సూచించారు. ఆస్పత్రి ఆధ్వర్యంలో హైపర్‌టెన్షన్, డయాబెటిస్ రోగులకు క్రమం తప్పకుండా మందులు అందించాలన్నారు. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఇళ్లల్లోకి దోమలు, ఈగలు ప్రవేశించకుండా కిటికీలు, తలుపులకు జాలీలు బిగించుకొని జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. అంతకు ముందు వీర్లగడ్డ తండాలో వాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్‌రెడ్డి, నివేదిత, వైద్య సిబ్బంది రాజు, తదితరులు పాల్గొన్నారు.

నక్షత్ర దీక్ష వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



నక్షత్ర దీక్ష వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి ప్రభాకర్, ఆలయ అర్చకులు

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో ఈ నెల 27న నిర్వహించనున్న నక్షత్ర దీక్ష వాల్‌పోస్టర్లను హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొత్తకొండ ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆలయ అధికారులకు ఆయన సూచించారు. కాగా, నక్షత్ర దీక్ష మాలధారణ ఈ నెల 27న ప్రారంభమై ఆగస్టు 23వ తేదీ వరకు కొనసాగుతుందని ఆలయ అర్చకులు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కిషన్‌రావు, అర్చకులు రాంబాబు, రాజయ్య, శ్రీకాంత్, వినయ్ పాల్గొన్నారు.

పరిశీలన.. పర్యవేక్షణ

కాజీపేట రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌లో కేంద్రమంత్రులు

- పలు విభాగాల్లో తిరుగుతూ పనుల పురోగతిపై ఆరా
- పనులు సంతృప్తికరమన్న కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్..
- 40 ఏళ్ల కల నెరవేరుతోందన్న మరో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- కాజీపేటలో మంత్రులకు ఘనస్వాగతం.. కిక్కిరిసిన జంక్షన్



రైల్వే యూనిట్‌లో పనులను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, చిత్రంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, నాయకులు ధర్మారావు, ప్రేమేందర్ రెడ్డి, రావు పద్మ తదితరులు



మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, చిత్రంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రామచందర్‌రావు



కార్మికుడిని ఆలింగనం చేసుకుంటున్న కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిలు శనివారం పరిశీలించారు. యూనిట్‌లోని పలు విభాగాల్లో జరుగుతున్న పనులను పరిశీలిస్తూ.. పర్యవేక్షిస్తూ వారి పర్యటన సాగింది. పలు విభాగాల్లో పనుల పురోగతిపై కేంద్రమంత్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వచ్చే ఏడాదినాటికి యూనిట్ నుంచి మాన్యుఫ్యాక్చరింగ్ ప్రారంభమవుతుందని, ఈ ఏడాది డిసెంబర్ కల్లా సివిల్ కన్‌స్ట్రక్షన్ మొత్తం పూర్తవుతుందని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. వరంగల్ జిల్లావాసుల 40 ఏళ్ల సాకారమవుతోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ముందుగా ప్రత్యేక రైలులో కాజీపేట జంక్షన్‌కు చేరుకున్న రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు హనుమకొండ కలెక్టర్ స్నేహశబరీష్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, రైల్వేస్టేషన్ మేనేజర్ అగ్గి రవీందర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కె.సంతోష్‌రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ మంత్రి జి.విజయరామారావు, మాజీ ఎంపీ సీతారాంనాయక్, మాజీ ఎమ్మెల్యేలు ఎం.ధర్మారావు, అరూరి రమేశ్ ఘనస్వాగతం పలికారు.

రోడ్డుమార్గంలో అయోధ్యపురం యూనిట్‌కు..

కాజీపేట జంక్షన్ నుంచి కేంద్రమంత్రులు నేరుగా రోడ్డుమార్గంలో అయోధ్యపురంలోని యూనిట్‌కు చేరుకున్నారు. మొదట మంత్రులు రైల్వే యూనిట్ లే అవుట్ రూంకు వెళ్లి లే అవుట్‌ను పరిశీలించారు. అనంతరం కాన్ఫరెన్స్‌హాల్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైల్వే యూనిట్ పనుల పురోగతి, కెపాసిటీని స్థానిక రైల్వే అధికారులు వివరించారు. తర్వాత వాహనాలపై రైల్వే యూనిట్ నిర్మాణ షాపులు, ట్రాక్‌లను తనిఖీ చేసుకుంటూ మెయిన్ షాప్ సమీపానికి చేరుకున్నారు. అక్కడి నుంచి షెడ్లను తనిఖీ చేశారు.

కార్మికులతో మాటామంతి..

యూనిట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కలిసి మాట్లాడారు. పనులు ఎలా సాగుతున్నాయని కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ఓ కార్మికుడిని ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. అనంతరం రోడ్డు మార్గం గుండా రైల్వే యూనిట్ సమీపంలో గల అయోధ్యపురం రైల్వే గేట్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే సిద్ధంగా ఉన్న ప్రత్యేక రైలులో మంత్రులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు, బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌రావు, రాష్ట్ర నాయకులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, చాడా శ్రీనివాస్‌రెడ్డి, రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ, డీఆర్‌ఎం భర్తేష్‌కుమార్ జైన్, సీఎంపీఈసీ మధుసూదన్‌రావు, సీనియర్ డీఎస్టీఈ ప్రియా అగర్వాల్, సీసీఓఎం పద్మజ సీనియర్ డీసీఎం షిఫాలి, ఆర్‌వీఎన్‌ఎల్ ఎలక్ట్రికల్ జీఎం ఆనంద్ చెక్కిల, ఈఎం మెకానికల్ వంశీ, సీపీఎం సాయిప్రసాద్, పీఈడీ మెకానికల్ మనీష్‌అగర్వాల్, సీపీఆర్వో ఎ.శ్రీధర్ పాల్గొన్నారు.

గంట ఆలస్యంగా పర్యటన..

కేంద్ర మంత్రులు షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 1:30 గంటలకు రావాల్సి ఉంది. కానీ, గంట ఆలస్యంగా 2:40 గంటలకు కాజీపేటకు చేరుకున్నారు. దీంతో రైల్వే స్టేషన్‌లో పెద్ద ఎత్తున బీజేపీ నేతలు, జిల్లా అధికారులు, మీడియా ప్రతినిధులు వేచి ఉన్నారు. మంత్రులు రాగానే వారిని కలిసేందుకు పోటీపడగా స్వల్ప తోపులాట జరిగింది. పుష్పగుచ్ఛాలు కిందపడ్డాయి. తాము మంత్రులను కలవలేకపోయామని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

వినతుల వెల్లువ - 8లో▸

'వయోవృద్ధుల' చట్టంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఆర్డీఓ నారాయణ

పరకాల: వయోవృద్ధుల వివిధ రకాల అవసరాలు తీర్చేందుకు తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని పరకాల ఆర్డీఓ డాక్టర్ కె.నారాయణ తెలిపారు. వయోవృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలు – పరిష్కార మార్గాలు అనే అంశంపై వయోవృద్ధుల సంక్షేమ సంస్థ పరకాల అధ్యక్షుడు రేపాల నర్సింహారాములు అధ్యక్షతన పరకాల ఆర్డీఓ కార్యాలయంలో శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీఓ నారాయణ మాట్లాడుతూ చట్టం అమలుకు పరకాల వయోవృద్ధుల సంక్షేమ సంస్థ నుంచి ముగ్గురు సభ్యులతో ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి, వయోవృద్ధుల నుంచి వచ్చిన 50 ఫిర్యాదులలో 26 పరిష్కరించినట్లు వివరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య, పరకాల ఐసీడీఎస్ సీడీపీఓ స్వాతి, వయోవృద్ధుల సంక్షేమ సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి యుగేందర్, ట్రిబ్యునల్ సభ్యులు భూషి ప్రభాకర్‌రెడ్డి, కోడిపాక సమ్మయ్య, సుంకర రామన్న, సభ్యులు నర్సయ్య, రవీందర్‌గౌడ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులను జాగ్రత్తగా చూసుకోవాలి

- కలెక్టర్ స్నేహ శబరీష్

హసన్‌పర్తి: గురుకుల పాఠశాలలో కొత్తగా ప్రవేశం పొందిన ఐదో తరగతి విద్యార్థులను జాగ్రత్తగా చూసుకోవాలని ఉపాధ్యాయులకు కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. నగరంలోని పలివేల్పుల క్రాస్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, వెల్‌నెస్ సెంటర్‌తో పాటు కిచెన్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. స్టోర్ రూంలో నిల్వ చేసిన బియ్యం, కూరగాయలు, ఆహార పదార్థాలను పరిశీలించారు. టాయిలెట్లతో పాటు విద్యాలయ పరిశుభ్రతపై ఆరా తీశారు. హాస్టల్‌లో ఏర్పాటు చేసిన ఫోన్ సౌకర్యం గురించి వాకబు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాల విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుభాషినితో పాటు అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినితో మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

తెలుగు విభాగం బీఓఎస్‌గా చిర్ర రాజు

● రిజిస్ట్రార్ పేషీలో జాయినింగ్ రిపోర్టు..



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా ఆ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చిర్ర రాజు శనివారం రిజిస్ట్రార్ పేషీలో జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు. తెలుగు విభాగం బీఓఎస్‌గా ఆ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మంథిని శంకర్ ఈ ఏడాది ఫిబ్రవరిలో నియమితులై కొనసాగుతున్నారు. ఇటీవల ఆయన స్థానంలో చిర్ర రాజును నియమిస్తూ రిజిస్ట్రార్ రామచంద్రం ఉత్తర్వులు జారీచేశారు. అయితే తనను సంవత్సరం పాటు కొనసాగించాలని మంథిని శంకర్ అదేరోజు వీసీ ప్రతాప్‌రెడ్డి వద్దకు వెళ్లి అడిగారు. దీంతో అక్కడే ఉన్న చిర్ర రాజు.. బీఓఎస్‌గా శంకర్‌ను కొనసాగించాలని చెప్పడంతో ఆయనే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కానీ అధికారులు చిర్ర రాజు నియామక ఉత్తర్వులు వెనక్కి తీసుకోలేదు. దీంతో శనివారం చిర్ర రాజు తెలుగు విభాగం బీఓఎస్‌గా రిజిస్ట్రార్ పేషీలో జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు. వాస్తవంగా మంథిని శంకర్ నుంచి చిర్ర రాజు బాధ్యతలు స్వీకరించాల్సింటుంది. అలా కాకుండా రిజిస్ట్రార్ పేషీలో జాయినింగ్ రిపోర్టు ఇవ్వడంతో తెలుగు విభాగంలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ విషయంపై రిజిస్ట్రార్ రామచంద్రం న'సాక్షి' వివరణ కోరగా తాను హైదరాబాద్‌లో ఉన్నానని, చిర్ర రాజు బీఓఎస్‌గా రిపోర్టు రిజిస్ట్రార్ పేషీలో ఇచ్చారని తనకు సమాచారం ఉందన్నారు. ఇటీవల ఉత్తర్వులు ఇచ్చినప్పుడు శంకర్ తననే కొనసాగించాలని కోరారని, అప్పుడు సరే అని చెప్పిన చిర్ర రాజు.. తాను క్యాంపస్‌లో లేనప్పుడు జాయినింగ్ రిపోర్టు ఇచ్చారన్నారు. ఈవిషయం వీసీ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

ఏడుబావులను చూడగలమా?

జలపాతం సందర్శించాలనే పర్యాటకుల కల నెరవేరేనా?

● ప్రమాదాలతో జలపాతం సందర్శన నిలిపివేత

● భద్రతా చర్యలు చేపట్టి ఈ వర్షాకాలంలోనైనా అనుమతించాలని కోరుతున్న పర్యాటకులు



ఏడు బావుల వద్ద పర్యాటకుల సందడి(ఫైల్)

కొత్తగూడ : చుట్టూ దట్టమైన అడవి. మధ్యలో ఎత్తైన గుట్టలు. గుట్టల సమీపంలో ఆహ్లాదకర ప్రకృతి అందాల నడుమ ఏడు బావుల జలపాతం. వర్షాకాలంలో ఈ ప్రకృతి అందాలు వీక్షించేందుకు తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుంచి పర్యాటకులు వచ్చే వారు. దారి సరిగా లేకపోయినా నడుచుకుంటూ వెళ్లి ఏడుబావులను చూసి ఆనందించేవారు. అయితే ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతుండడంతో మూడేళ్లుగా ఇక్కడికి పర్యాటకులను అనుమతించడం లేదు. భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతం బయ్యారం మండలం మిర్యాలపెంట గ్రామ సమీపంలోని పాండవుల గుట్టల్లో ఉన్న ఏడు బావుల జలపాతాన్ని ఈవర్షాకాలంలోనైనా సందర్శించే కల నెరవేరుతుందా.? అనే చర్చ సాగుతోంది.

జలపాతం విశిష్టత..

ఈ జలపాతం ఎత్తైన పాండవుల గుట్టల పైనుంచి ఏడు గుట్టలు దాటుతూ భూమిని తాకుతుంది. ఒక్కో గుట్టపై నీరు పోసిన చోట బావి ఏర్పడింది. ఏడు చోట్ల బావులుగా ఏర్పడడం వల్ల ఏడు బావులు అనే పేరు వచ్చింది. పైనుంచి జాలు వారే నీరు ఎంత వచ్చినా 500 మీటర్ల దూరం ప్రవహించి భూమిలో ఇంకిపోతుంది. అన్ని నీళ్లు ఒకేసారి భూమిలోకి ఎలా ఇంకుతాయో అనే అంశమే ఇక్కడి విశిష్టత. దీనిని చూసి తరించేందుకు పర్యాటకులు భారీగా తరలివస్తారు.



ఏడు బావులు చూసేందుకు గుట్ట ఎక్కుతున్న పర్యాటకులు(ఫైల్)

ప్రమాదాలతో సందర్శన నిషేధం..

గుట్టపైకి ఎక్కి ఏడు బావుల్లో స్నానం చేసేందుకు పర్యాటకులు యత్నించి జారి పడడం, కొందరు యువకులు మద్యం మత్తులో గుట్ట ఎక్కడం వల్ల ప్రమాదాలు సంభవించాయి. నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోవడంతో పోలీసులు, అటవీ శాఖ అధికారులు సందర్శనను నిషేధించారు.

పర్యాటకంగా అభివృద్ధి చేయాలి..

అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసి ఏడు బావులు సందర్శించేలా ఏర్పాటు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు. అలాగే, ట్రెక్కింగ్‌కు కూడా ఏర్పాటు చేయాలని పేర్కొంటున్నారు. అటవీ శాఖ సిబ్బందిని నిరంతరం కాపలా ఉంచాలని కోరుతున్నారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయం రావడంతో పాటు పర్యాటకుల కల నెరవేరుతుందని, స్థానికులకు ఉపాధి లభిస్తుందని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఏడు బావులకు వెళ్లే అటవీ మార్గం

ప్రమాదాలు జరిగాయనే జలపాతం సందర్శన నిలిపివేత..

"జలపాతం చూసేందుకు వచ్చిన పర్యాటకులు గుట్టలు ఎక్కడానికి ప్రయత్నించి ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. అందుకే జలపాతం సందర్శనను నిలిపివేశాం. పాండవుల గుట్టలు పూర్తిగా అటవీ ప్రాంతం. అందుకే ఇక్కడ పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేయడం కష్టం.

-రవికుమార్, ఎస్సై, గంగారం

ఉన్నతాధికారులకు తెలియజేశా..

ఏడు బావులు జలపాతాన్ని అటవీ శాఖ ద్వారా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ఉన్నతాధికారులకు తెలియజేశా. ప్రభుత్వం అనుమతి ఇస్తే అభివృద్ధి చేయిస్తాం. ఏడు బావులతో పాటు పందెం సమీపంలో అవీ ప్రాంత సందర్శనకు గతంలో ఏర్పాట్లు జరిగాయి. రెండు ప్రాంతాలు కలిపి పర్యాటకుల సందర్శనకు అనుమతి ఉండేలా నివేదికలు పంపాం.

-చంద్రశేఖర్, ఎఫ్‌డీఓ,గూడూరు

సాయం చేద్దాం.. ప్రాణం కాపాడుదాం

● కాలేయ వ్యాధితో బాధపడుతున్న శివప్రసాద్

● వైద్యానికి రూ.10 లక్షల ఖర్చు..

● మరో రూ.5లక్షలు ఉంటేనే ఆపరేషన్..

● చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితి

● దాతల సాయం కోసం కుటుంబ సభ్యుల వేడుకోలు



దీన గాథ

జనగామ: అందరం ఒక్కటైతే ఆ ప్రాణం నిలబడుతుంది. చేయి చేయి కలిపితే అతడు బతుకుతాడు. మానవతావాదులు ముందుకు వచ్చి ఆపన్న హస్తం అందించాలని కుటుంబీకులు చేతులెత్తి వేడుకుంటున్నారు.

వివరాల్లోకి వెళ్తే..

జనగామ జిల్లా కేంద్రం వీవర్స్ కాలనీకి చెందిన అందె శివప్రసాద్ మెడికల్ షాపులో పని చేస్తున్నాడు. తండ్రి చిన్నప్పుడే మృతి చెందగా తల్లి మహేశ్వరి కొడుకును పెంచి పెద్ద చేసింది. శివప్రసాద్‌కు పల్లవితో వివాహం చేయగా, ఆ దంపతులకు నాలుగు సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. నెలంతా కష్టపడితే వచ్చే రూ.12వేల వేతనంతోనే శివప్రసాద్ కుటుంబాన్ని పోషించాడు. ఈ క్రమంలో ఇటీవల శివప్రసాద్ అనారోగ్యానికి గురికావడంతో కుటుంబీకులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెడికల్ టెస్ట్‌లు పూర్తి చేసిన తర్వాత కాలేయ వ్యాధిగా నిర్ధారించారు. కొడుకు కష్టపడితేనే ఇల్లు గడిచే పరిస్థితుల్లో ఆ పెద్ద దిక్కే మంచం పట్టడంతో ఆ నిరుపేద కుటుంబం ఆగమైపోతుంది. శివప్రసాద్‌ను బతికించుకునేందుకు ఉన్న ఆస్తితో పాటు తల్లి, భార్య వద్ద ఉన్న కొద్దిపాటి బంగారాన్ని అమ్మి వైద్యానికి ఇప్పటి వరకు రూ.10లక్షల వరకు ఖర్చు చేశారు. ప్రతి నెల మందుల కోసం రూ. 20వేల వరకు ఖర్చు చేస్తున్నారు. అయినా ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు వెంటనే ఆపరేషన్ చేయాలని సూచించారు. ఇందుకు రూ.5లక్షలకు పైగా ఖర్చు అవుతుందని చెప్పడంతో చిల్లి గవ్వ లేక కుటుంబీకులు తల్లడిల్లిపోతున్నారు. ఆపరేషన్ చేస్తే బతికే అవకాశం ఉండడంతో మనసున్న వారి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. దాతలు ముందుకొచ్చి ఓ ప్రాణం కాపాడాలని కుటుంబీకులతోపాటు అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు కోరుతున్నారు.



మంచంపై శివప్రసాద్, దాతల సాయం కోరుతున్న తల్లి

ఆర్థిక సాయం చేసే వారు ఫోన్ పే నంబర్‌తో పాటు బ్యాంకు ఖాతాకు నేరుగా పంపించొచ్చు.
ఫోన్‌పే,గూగుల్ పే నంబర్:7036161005(అందె శివప్రసాద్)
బ్యాంకు ఖాతా నంబర్:168210400004 7524(ఐడీబీఐ,జనగామ బ్రాంచ్)
ఐఎఫ్ఎస్ కోడ్:ఐబీకేఎల్0001682

బీఆర్‌ఎస్ పాపాలకు జీవితాంతం జైలులోనే

● వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న నాయిని రాజేందర్ రెడ్డి, పక్కన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తదితరులు

హన్మకొండ చౌరస్తా: బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో చేసిన పాపాలు, అక్రమాలకు కేసులు పెడితే వారి జీవితం మొత్తం జైలులోనే ఉంటారని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఖమ్మంలో కేటీఆర్ మాట్లాడిన భాషపై మండిపడ్డారు. సీఎం హోదాను విస్మరించి రేవంత్‌రెడ్డి పట్ల కేటీఆర్ మాట్లాడిన భాష అతని అహంకారానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేస్తుంటే కళ్లు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ చదువుకున్న మూర్ఖుడిలా మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్ ఓ బఫూన్ అన్నారు. దేశం విడిచివెళ్లిన విజయ్‌మాల్యా కంటే అతిప్రమాదకరమైన ఆర్థిక నేరస్తుడు కేటీఆర్ అని అన్నారు. నువ్వు , నీ అయ్య ఉద్యమాలు చేస్తే తెలంగాణ రాష్ట్రం రాలేదని, పోలీస్ కిష్టయ్య, శ్రీకాంతాచారి లాంటి ఎందరో అమరుల త్యాగఫలితమే స్వరాష్ట్రం వచ్చిందన్నారు. కేటీఆర్ (మైగేట్) శవాల నుంచి వచ్చే ఓ పురుగుగా అభివర్ణించారు. కేటీఆర్ అంతా దిగజారిన నాయకుడిని ఎప్పుడూ చూడలేదన్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాదయాత్ర అంటూ మరో డ్రామాకు తెరలేపాడని అన్నారు. ఎన్ని నాటకాలు వేసిన వర్ధన్నపేట, పాలకుర్తి ప్రజలు ఆయన్ను నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు.

ఎకోటూరిజం అభివృద్ధికి అడుగులు?

● ఇనుపరాతి గుట్టలను సందర్శించిన పీసీసీఎఫ్



ఇనుపరాతి గుట్టలను సందర్శిస్తున్న పీసీసీఎఫ్ సువర్ణ

ధర్మసాగర్: హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం దేవునూరు, ముప్పారం శివారులోని ఇనుపరాతి గుట్టలను శనివారం పీసీసీఎఫ్(ప్రిన్సిపల్ చీఫ్ కన్వర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) సువర్ణ, హైదరాబాద్ జూ పార్కు సీసీఎఫ్ సునీల్ కుమార్, వరంగల్, హనుమకొండ డీఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, భద్రాద్రి సర్కిల్ ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ కృష్ణమాచారి సందర్శించారు. ఈ సందర్భంగా ఇనుపరాతి గుట్టల ప్రాంతంలో అటవీ శాఖకు సంబంధించిన భూముల వివరాలు తెలుసుకున్నారు. గతంలో రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ హామీలో భాగంగా జూ పార్కు తరలింపు, ఎకోటూరిజం ఏర్పాటుకు అడుగులు పడుతున్నట్లు సమాచారం. హనుమకొండ జిల్లాలోని ధర్మసాగర్, వేలేరు, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల పరిధిలో విస్తరించి ఉన్న ఇనుపరాతి గుట్టలు అన్యాక్రాంతం కాకుండా చూడాలని సిబ్బందికి సూచించినట్లు సమాచారం. కాగా, దేవునూరు శివారులో ఎకో టూరిజం ఏర్పాటు చేస్తే ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయా గ్రామాల ప్రజల ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీసీఎఫ్ భీమా నాయక్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ భిక్షపతి, డీఆర్ఓ మోహన్ లాల్, బీట్ ఆఫీసర్ రతన్ లాల్, కొత్తగూడెం రేంజ్ డీఎఫ్ఓ కృష్ణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే మంత్రికి వినతుల వెల్లువ..



రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ ఫ్యాక్టరీ యూనిట్ పరిశీలనకు వచ్చిన కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు పలువురు వినతులు సమర్పించారు. విజ్ఞప్తులు చేశారు. కాజీపేట రైల్వే వీఐపీ లాంజ్‌లో వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కె.ఆర్.నాగరాజు కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కాజీపేటను రైల్వే డివిజన్ చేయాలని, రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌లో స్థానికులకు 50 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని, కాజీపేట బస్టాండ్ కోసం కావాల్సిన స్థలం కేటాయించాలని, చిరువ్యాపారులకు షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించాలని అందరం కోరినట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు.

మంత్రి దృష్టికి రైల్వే సమస్యలు..

రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు రైల్వే జేఏసీ నాయకులు, రైల్వే మజ్దూర్ యూనియన్, రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు, రైల్వే ఎస్సీ, ఎస్టీ, రైల్వే ఓబీసీ, రైల్వే పెన్షనర్ల సంఘాలు ఉమ్మడిగా రైల్వే, కార్మికుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని, భూ నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని, కాజీపేటను డివిజన్ చేయాలని, కాజపేట టౌన్ స్టేషన్‌ను కారిడార్‌గా చేయాలని, రైల్వే ఇన్‌స్టిట్యూట్ (క్లబ్)ను పునరుద్ధరించి నూతన భవనం నిర్మించాలని, ఈఎల్ఎస్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని, ప్లాట్‌ఫామ్‌ల సంఖ్య పెంచాలని, కాజీపేటలో 16 రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని వినతి పత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో దేవులపల్లి రాఘవేందర్, కొండ్ర నర్సింగరావు, కాల్వ శ్రీనివాస్, ఎస్.వెంకటనారాయణ, దిలీప్, ఆర్.రమేశ్, ఎంఎల్.నారాయణ, మాధవరావు, బిల్విందర్, పాషా, మధు, నారాయణ, వెంకటస్వామి, వేదప్రకాశ్, గిరిమిట్ల రాజేశ్వర్, జి.భాస్కర్, పి.రమేశ్ పాల్గొన్నారు. డీఎంఆర్‌కేఎస్ నుంచి యమునాకర్‌రెడ్డి, మంచాల రమేశ్, రాజు, మహేందర్, చంద్రమొగిళి.. రైల్వే మంత్రిని కలిసి కాజీపేట డివిజన్ చేయాలని, ఫిట్‌లైన్లను వినియోగంలోకి తీసుకురావాలని, రైల్వే లింక్‌లను పునరుద్ధరించాలని వినతిపత్రం అందజేశారు.

రైల్వే యూనిట్‌లో ఇంటికో ఉద్యోగం ఇవ్వాలి..

కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, కిషన్‌రెడ్డిను కలిసి తమ భూమిని రైల్వే యూనిట్‌కు ఇచ్చామని, తమకు ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని భూ నిర్వాసితులు గాదెం యాదగిరి, మామిండ్ల భిక్షపతి, జెరుపోతుల కుమారస్వామి, ఉల్లెంగుల శ్రీనివాస్, కాయిత స్వరూప, మామిండ్ల మల్లమ్మ వినతి పత్రం అందజేశారు. జిల్లా అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం తమకు వివరాలు పంపిస్తే న్యాయం చేస్తామని మంత్రులు హామీ ఇచ్చారని గాదెం యాదగిరి తెలిపారు.

పుష్‌పుల్ రైలును పునఃప్రారంభించాలి

ఖిలా వరంగల్ : వరంగల్ నుంచి సికింద్రాబాద్ వరకు పుష్‌పుల్ రైలును పునః ప్రారంభించాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్, బీజేపీ రాష్ట్ర నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు.. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. అలాగే, నెక్కొండలో శాతవాహన, పద్మావతి, ఇంటర్‌సిటీ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని కోరారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

● మేయర్ గుండు సుధారాణి



కాజీపేట సర్కిల్ కార్యాలయంలో తనిఖీ చేస్తున్న నగర మేయర్ సుధారాణి

వరంగల్ అర్బన్: అధికారులు, ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలందించాలని నగర మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. కాజీపేటలోని సర్కిల్ కార్యాలయాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా విభాగాల్లో కలియ తిరుగుతూ అధికారులు, సిబ్బంది విధులకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిటిజన్ చార్టర్ ప్రకారం ఫైళ్లను సకాలంలో పరిష్కరించాలని చెప్పారు. కాజీపేట, కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయాల్లో మరుగుదొడ్లకు మరమ్మతులు చేసి నిర్వహణ చేపట్టాలన్నారు. కాజీపేట సర్కిల్ పరిధిలో రూ.28 కోట్ల నల్లా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ క్రమంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నెలరోజుల్లో రూ.10 కోట్లు వసూలు చేయాలని ఆదేశించారు. మూడు అద్దె భవనాలపై ఉన్న కోర్టు కేసులు త్వరగా పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రెసిడెన్షియల్ నల్లాలుగా అనుమతులు పొంది కమర్షియల్‌గా వినియోగిస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని మేయర్ హెచ్చరించారు. తనిఖీల్లో డిప్యూటీ కమిషనర్ గొడిశాల రవీందర్ గౌడ్, ఏసీపీ ప్రశాంత్, ఈఈలు రవికుమార్, శ్రీనివాస్, డీఈ సారంగం, టీపీఎస్‌లు రోజారెడ్డి, సుమన, ఏఈ హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల నిరసన ఉద్రిక్తత

● సీఎం దిష్టిబొమ్మ దహనానికి వామపక్షాల విద్యార్థి సంఘాల యత్నం

● అడ్డుకున్న పోలీసులు..



రోడ్డుపై బైఠాయించిన విద్యార్థి నాయకులు

హన్మకొండ: ఈ నెల 23న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం, నిరసన కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. హనుమకొండలోని కాళోజీ కూడలికి వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు శనివారం తరలివచ్చారు. నిరసనలో భాగంగా సీఎం దిష్టిబొమ్మను దహనం చేసేందుకు పూనుకోగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో విద్యార్థి సంఘాలు, పోలీసుల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగి పరిస్థితులు ఉద్రిక్తతంగా తయారయ్యాయి. దిష్టిబొమ్మను దహనం చేయకుండా పోలీసులు లాక్కోవడంతో ఆగ్రహించిన విద్యార్థి సంఘాల నాయకులు.. కాళోజీ కూడలిలో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం లాగానే ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యారంగాన్ని విస్మరిస్తోందని విమర్శించారు. ఈనెల 23న చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బాష బోయిన సంతోష్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రాచకొండ రంజిత్, జిల్లా ఉపాధ్యక్షురాలు అనూష, ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనర్ రోహిత్, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కన్వీనర్ మాస్ సావిత్రి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం చిత్తు

● జిల్లా ప్రిన్సిపల్ జడ్జి పట్టాభిరామారావు



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రిన్సిపల్ జడ్జి పట్టాభిరామారావు

విద్యారణ్యపురి: మత్తు పదార్థాల వినియోగంతో జీవితాలు చిత్తవుతాయని, ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని హనుమకొండ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జిల్లా ప్రిన్సిపల్ జడ్జి డాక్టర్ పట్టాభిరామారావు అన్నారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, నార్కొటిక్ బ్యూరో జిల్లా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు, డ్రగ్స్ అబ్యూస్‌పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మత్తు పదార్థాల వినియోగం పల్లెలకు కూడా సోకిందని తెలిపారు. దీన్ని అరికట్టాల్సిన బాధ్యత తామందరిపై ఉందని గుర్తుచేశారు. డ్రగ్స్ వాడకం వలన కలిగే నష్టాలను వీడియో ద్వారా నార్కొటిక్ బ్యూరో వరంగల్ డీఎస్పీ సైదులు అవగాహన కల్పించారు. సమావేశంలో కేడీసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాస్, జిల్లా న్యాయసేవా సంస్థ సెక్రటరీ క్షమాదేశ్ పాండే, యాంటీ నార్కొటిక్ వరంగల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, యాంటీ డ్రగ్స్ కమిటీ కన్వీనర్ డాక్టర్ శశికాంత్, సభ్యులు సమత, గంగిశెట్టి శ్రీనివాస్, గన్‌సింగ్, విద్యార్థి విభాగం సభ్యులు గునవర్ధన్, ప్రత్యూష, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రజనీలత, అధ్యాపకులు ఇందిర, సీతారాం, సంధ్యారాణి, రవికుమార్, చిన్నా పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి...

కాజీపేట అర్బన్: ప్రజల సమస్యల పరిష్కారానికి కమ్యూనిటీ మోటివేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు హనుమకొండ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి డాక్టర్ పట్టాభిరామారావు తెలిపారు. హంటర్‌రోడ్డులోని వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డు భవన సముదాయంలో పద్మశాలి కమ్యూనిటీ మోటివేషన్ సెంటర్‌ను ఆయన శనివారం ప్రారంభించారు.కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ క్షమాదేశ్ పాండే, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, బార్ కౌన్సిల్ మెంబర్ దుస్సా జనార్దన్, హనుమకొండ, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు పులి సత్యనారాయణ, వలస సుధీర్‌కుమార్, న్యాయవాదులు గంజి గణేష్, పొరండ్ల రాజయ్య, మోటివేటర్ బాల్నె శరత్‌బాబు, వడ్నాల నరేందర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి



మాట్లాడుతున్న ఆనంద్ గౌడ్

వరంగల్ చౌరస్తా : కేంద్ర అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ సూచించారు. శనివారం వరంగల్ హంటర్ రోడ్డులోని సత్యం కన్వెన్షన్ హాల్‌లో పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికల కార్యాచరణపై జరిగిన సమావేశంలో ఆనంద్ గౌడ్ మాట్లాడారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అన్నీ సీట్లల్లో పోటీ చేసేందుకు బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ అరూరి రమేష్ మాట్లాడుతూ మతపరమైన రిజర్వేషన్లు ఉండకూడదని బీఆర్ అంబేడ్కర్ స్పష్టం చేశాన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, నాయకులు వంగాల సమ్మిరెడ్డి, కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, వన్నాల వెంకటరమణ పాల్గొన్నారు.